సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 25 । డిసెంబర్ । 2024



సమస్యను పరిష్కరించాలి
భూముల జాయింట్ ఎల్‌పీఎం సబ్‌డివిజన్‌లకు సంబంధించిన సర్వే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ తహసీల్దార్‌కు సూచించారు. - 10లో



విద్యార్థులకు పరీక్షా సమయం
నగటు విద్యార్థికి ఇంటర్మీడియట్ విద్య కీలక దశ. ఇక్కడే అధిక సంఖ్యలో విద్యార్థులు వెనుకబడి పోతుంటారు. - 10లో



తాత్కాలిక మరమ్మతులు
బొబ్బిలి: 'గుంతల పేరుతో నిధుల గల్లంతు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంలో పాత బొబ్బిలి రహదారి గుంతల ప్రస్తావన వచ్చింది. ఈ కథనానికి స్పందించిన యంత్రాంగం గోతులను తాత్కాలికంగా మెటల్, రాళ్లతో పూడ్చే పనులు చేపట్టింది.

న్యూస్‌రీల్

కరెంట్ చార్జీల బాదుడుపై.. వైఎస్సార్‌సీపీ పోరుబాట



విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: ప్రజలపై విద్యుత్ చార్జీల మోతకు నిరసనగా వైఎస్సార్‌సీపీ సమరశంఖం పూరించింది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం.. వినియోగదారులే విద్యుత్ ఉత్పత్తి చేసి డిస్కింలకు అమ్ముకునేలా ప్రోత్సహిస్తాం, ప్రజలకు చార్జీల నుంచి ఉపశమనం కలిగిస్తాం అంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పోరుబాటకు పిలుపునిచ్చింది. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ధర్మపురిలోని సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని నేడు వంచనకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని కూటమి ప్రభుత్వానికి ప్రశ్నించారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై చేపడుతున్న పోరుబాటలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆ రోజు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టి పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

ఎమ్మెల్యే తనయుడి కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి



చెప్పల భోగయ్య(ఫైల్)

పాతపట్నం: మండలంలోని కొరసవాడ సమీపంలో ఈనెల 21వ తేదీన పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు మామిడి సాయి గణేష్‌కు చెందిన కారు ఆటోను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన చెప్పల భోగయ్య(50) శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగిస్తామని తెలిపారు. ఘటనలో మరో నలుగురు చెప్పల సంతోషి, సవలాపురం నరేష్, గణేష్, ఆటో డ్రైవర్ కూర్మాన సునీల్‌లు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వదలని వాన

- చివరిలో ముంచుతోంది!
- ఆందోళనలో రైతన్న
- మొలకలు వస్తున్న ధాన్యం

పాలకొండలో కురుస్తున్న వర్షం





భామిని: పసుకుడిలో రోడ్డు పక్కనే టార్పాలిన్లు కప్పి ఉన్న ధాన్యం రాశి

సాక్షి, పార్వతీపురం మన్యం: అన్నదాతలో మళ్లీ కలవరం.. మొన్న ఫెంగల్, నిన్న అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాల తడి ఆరకముందే.. మరో తుపాను ఏర్పడడం ఆందోళన కలిగిస్తోంది.



వర్షం కురుస్తున్నా కళ్లంలో నుంచి ధాన్యాన్ని ట్రాక్టర్‌తో తరలించేందుకు సిద్ధం చేసిన పాలకొండ మండల రైతులు

మంగళవారం ఉదయం నుంచి మన్యం ముసురు పట్టింది. ప్రస్తుతానికి భారీ వర్షాలు లేకపోయినప్పటికీ.. రోజంతా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకే కల్లాల్లో ఉన్న ధాన్యం, అపరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇంకా నీరు పూర్తిగా తొలగకముందే మళ్లీ తుపాను రావడంతో ఏం చేయాలో తోచక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

మిల్లర్ల కొర్రీ

ఓవైపు వర్షం కురుస్తున్నా.. టార్పాలిన్లు కప్పి, ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే.. అక్కడ మిల్లర్లు కొర్రీ పెడుతున్నారు. రంగు మారిందని.. ముక్కలు అయిపోతుందని సాకు చూపెడుతున్నారు. రైతులు మరీ బతిమలాడితే.. అదనంగా ఎన్ని కిలోలు ఇస్తావంటూ బేరమాడుతున్నారు. లేదంటే ధాన్యాన్ని తీసుకెళ్లి, పందుల పెంపకందారులకు మేతకు వేసేయాలంటూ పలు చోట్ల మిల్లర్లు పరిహాసమాడుతున్నారని రైతులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఈ ఏడాది 1,75,474 ఎకరాల్లో వరి సాగవ్వగా.. దాదాపు 98 శాతం కోతలు పూర్తయ్యాయి. వరి పంట చేతికొచ్చిన దశలో ఇటీవల మూడు రోజులపాటు 65.8 మి.మీ. సగటు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో జిల్లాలోని పలు మండలాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో కోసి ఉంచిన వరి పనలతోపాటు, కుప్పలుగా పెట్టిన వరి కుప్పలను నూర్చి అమ్ముకుని.. పెద్ద పండగను సంతోషంగా గడుపుకొందామనుకున్న రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చిమ్మాడు. చివరి దశలో పంట నష్టపోవడంతో ఏడాది కష్టం మట్టిపాలైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నూర్పులు పూర్తయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధమవుతున్న సమయంలో మరోసారి వానలు కురుస్తుండటం వారిని మరింత ఆందోళన కలిగిస్తోంది. పాలకొండ మండలం వడమ గ్రామంలో అంపోలు చిన్నంనాయుడు కల్లంలో ధాన్యం మొలక వచ్చేస్తోంది. వెలగవాడ గ్రామంలో అల్లు కోటేశ్వరరావు పొలంలోనూ మొలకలు వచ్చేస్తుండడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. భామిని మండలం మొత్తం నూర్చిన ధాన్యాన్ని రైతులు ఇళ్లకు తరలించుకుంటున్నారు. ఇందులో కూడా చాలా వరకు మొలకలు వస్తున్నాయని చెబుతున్నారు. వర్షాలతో పత్తి, మొక్కజొన్న పంటలకూ పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది.

అధికారుల సహకారం కొరవడింది..

వరి పండించిన రైతులకు అధికారుల నుంచి సహకారం కొరవడింది. ఓ వైపు కొనుగోలు కేంద్రాల సమస్యలు, మరోవైపు వర్షాలు రైతులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యయప్రయాసలకోర్చి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే.. అక్కడ మిల్లర్లు దించనీయడం లేదు. కొర్రీలు పెడుతున్నారు. సక్రమమే రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని అధికార యంత్రాంగం తీసుకోవాలి. - బుడితి అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

తడిచిన ధాన్యం, పత్తిని కొనుగోలు చేయాలి

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో ఇంకా కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. వర్షంతో పత్తి రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా తక్షణమే ధాన్యం, పత్తి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. సమీపంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- కొల్లి సాంబమూర్తి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

పార్వతీపురం టౌన్: అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి అన్నారు. యూనియన్ బ్యాంక్ అధికారులతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్లను పోలీస్ వెల్ఫేర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి ప్రజలను ఎలా కాపాడాలి అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాలకు ఎక్కువ అవకాశం ఉండే ప్లాట్‌ఫాం బ్యాంకింగ్ సిస్టమ్‌గా పేర్కొన్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లు అమాయకుల ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకట తిలక్ మాట్లాడుతూ అక్షరాస్యులు కూడా సైబర్ నేరస్తుల ఉచ్చులో చిక్కుకుంటున్నారని, ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమన్నారు. నేరాలపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన, పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీఐ సీఐ పి.రంగనాథం, డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్, ఈఈ సీఐ అప్పారావు, ఆర్‌ఐలు నాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

వర్షమైనా ఆగని గురువుల పోరాటం



పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని, డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని కోరుతూ గత 35 రోజులుగా గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా పోరుబాటను ఆపలేదు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మంగళవారం మానవహారం నిర్వహించి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజాసంఘాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇల్లు ముట్టడికి సిద్ధం కావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, రాజు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సంఘం నాయకులు దివాకర్, కామేష్, రాజేష్, జ్యోతి, ఉమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. - పార్వతీపురంటౌన్

ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు శేషగిరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు శేషగిరిబాబు

పార్వతీపురం: జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్, జిల్లా ఎన్నికల పరిశీలకుడు ఎం.వి.శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం–2025పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో ఆయన సోమవారం సమీక్షించారు. ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమంపై అభ్యంతరాలు, తొలగింపులు ఉంటే తెలియజేయాలన్నారు. కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కళాశాలల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించి యువతను ఓటర్లుగా నమోదు చేసినట్లు తెలిపారు. బీఎల్‌ఓల ద్వారా స్వీప్ కార్యక్రమం, ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియలు పక్కాగా నిర్వహించామన్నారు. ఓటు జాబితాలు తుది ప్రచురణ దశలో ఉన్నాయన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నమ్మకం కలిగించే.. పాలన అవసరం

- పెన్షన్ల తొలగింపుపై స్పష్టత ఇవ్వండి
- తుఫాన్ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- ఎస్సీ, ఎస్టీ, గిరిజన కార్పొరేషన్ల నుంచి కానరాని భరోసా
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో పలు అంశాలను చర్చించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు

విజయనగరం రూరల్: ప్రభుత్వం ఏదైనా అది ప్రజలకు అండగా ఉంటూ నమ్మకం కలిగించాలే తప్ప ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పాలన ఉండరాదని ఉమ్మడి విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలో పెన్షన్ల తొలగింపు, తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతన్నలను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్థాయి సంఘ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ముందుగా 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్ చైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన, 4వ స్థాయీ సంఘ సమావేశం సింహాచలం అధ్యక్షతన జరిగాయి. ఆయా సంఘాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో చర్చించారు.

పెన్షన్లు తొలగించబోమని భరోసా ఇవ్వాలి

ఇటీవల పెన్షన్ల తొలగింపుపై వస్తున్న ఆరోపణలపై డీఆర్‌డీఏ జిల్లా అధికారులతో చర్చసాగింది. దీనిపై స్పష్టత ఇవ్వాలని చైర్మన్ వారిని కోరగా జిల్లాలో పింఛన్లు తొలగించాలని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం అందలేదని, జిల్లాలో పూసపాటిరేగ మండలం వెల్దూరు గ్రామంలో మాత్రం పెన్షన్ పంపిణీపై సర్వే చేపట్టామన్నారు. దాని తరువాత మళ్లీ యథావిధిగానే పెన్షన్లు పంపిణీ చేసినట్టు పీడీ తెలిపారు. బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ నూతన పెన్షన్లు ఇప్పటివరకూ మంజూరుకాలేదని, కొంతమందికి ఆన్‌లైన్‌లో చూపుతున్నాయే తప్ప మంజూరు కాలేదని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై అధికారులు సమాధానమిస్తూ కొత్త ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. నవంబర్ నెల నుంచి భర్తను కోల్పోయిన వితంతువులకు మాత్రమే పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ వచ్చాయన్నారు.


రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు

ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ధాన్యం తడిసిపోయినా ఎలాంటి పరిహారం అందజేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. పంట నష్టం వివరాలు నమోదు చేయాలని కోరారు. గజపతినగరం జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు మాట్లాడుతూ గ్రామాల్లో మినీ గోకులాలను అధికార పార్టీ నేతలు చెప్పినవారికే ఇస్తున్నారని, వాటి నిబంధనలు ఏమిటో, ఎవరు అర్హులో తెలియజేయాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ అనర్హులకు మంజూరు చేసినట్టు మా దృష్టికి తెస్తే పరిశీలించి రద్దుచేస్తామన్నారు. ఆవులకు బీమా చేసిన వారికి మాత్రమే గోకులాలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న పంటలకు కేవలం ఆరువేల మంది రైతులే బీమా ప్రీమియం చెల్లించినట్టు జామి జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు ప్రశ్నకు వ్యవసాయ అధికారులు సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలుచేసి రైతులకు ప్రయోజనం కల్పించిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రయోజనాన్ని తొలగించడంపై పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ, బీసీ, గిరిజన కార్పొరేషన్ నుంచి సాయం శూన్యం



జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఎస్సీ, బీసీ, గిరిజన కార్పొరేషన్‌ల నుంచి అర్హులకు ఎలాంటి సాయం అందించారో చెప్పాలని సబంధిత అధికారులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించగా... యాక్షన్ ప్లాన్ వచ్చిందే తప్ప ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందించాలని గైడ్‌లైన్స్ రాలేదని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారని, వారికి అండగా స్వయం ఉపాధి కోసం రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం చొరవ చూపకపోవడంపై జెడ్పీ చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యువతను ఆదుకునేలా చూడాలన్నారు.

ఆర్‌డబ్ల్యూస్ అధికారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్‌మిషన్ (జేజేఎం) పనుల్లో కొన్నింటిని రద్దు చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందన్నారు. ఇప్పటివరకు నూతన పనులు ప్రారంభించలేదని, పాతవాటిని పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, రెండు జిల్లాల జెడ్పీటీసీలు, అధికారులు, కమిటీ మెంబర్లు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్



పార్వతీపురం లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఏసు ఆరాధకులు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్



విద్యుత్ కాంతుల్లో ఆర్‌సీఎం చర్చి

పార్వతీపురంటౌన్: క్రీస్తు బోధనలు, సందేశం యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయమని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను (హైటీ) ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ క్రిస్మస్ కేకును కట్‌చేసి పాస్టర్లకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని క్రైస్తవులందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ చాలా ప్రత్యేకమైనదని, చల్లని, ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకునే పండగగా పేర్కొన్నారు. క్రీస్తు శాంతి సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. క్రీస్తు మార్గంలో నడుస్తూ జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలుత కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి ఆర్.ఎస్.జాన్, డీపీఆర్‌ఓ ఎల్.రమేష్, సీపీఓ వీర్రాజు, పాస్టర్ విజయకుమార్, బ్రదర్ ఆనంద్, మత పెద్దలు ఎం.ఎ.నాయుడు, మనోహర్‌బాయి, సదానందం, బాలచందర్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ పండగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని చర్చిలన్నీ అందంగా ముస్తాబుచేశారు. క్రైస్తవ ఆరాధకులు అర్ధరాత్రి నుంచే వేడుకల్లో పాల్గొన్నారు. శిలువ ఊరేగింపు, మొదటి ఆరాధనలను చర్చి బిషప్‌లు ప్రారంభించారు. భక్తులంతా కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

ప్రజలందరికీ ఏసు దీవెనలు



రాజన్నదొర, రోజమ్మ దంపతులను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

సాలూరు: లోక రక్షకుడైన ఏసు ప్రభువు దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలని మాజీ డిప్యూటీ సీ ఎం పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. క్రైస్తవులందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సాలూరు ఆర్‌సీఎమ్ చర్చి ఫాదర్ రాజన్నదొర, రోజమ్మ దంపతులకు మంగళవారం బాలయేసు ప్రతిమను అందించి ఆశీర్వచనాలు అందజేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కలవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. అమ్మవారికి తీపిపదార్థాలు, పండ్లతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

సీనియర్ మహిళల కబడ్డీలో పట్టణ విద్యార్థిని ప్రతిభ


విజేతను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసాయిదేవమణి

విజయనగరం అర్బన్: ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో ఇటీవల జరిగిన 71వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విజయనగరం మహిళల జట్టు ద్వితీయస్థానం సాధించాయి. ఆ జట్టులో సత్య కళాశాల విద్యార్థిని బి.నీలిమ విజయంలో కీలకపాత్ర వహించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతను కళాశాల యాజమాన్యం అభినందించింది.

290 మద్యం బాటిల్స్ స్వాధీనం

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో 290 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణ రావు మంగళవారం తెలిపారు. కోటగండ్రేడు సమీపంలో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని తనిఖీ చేయగా 290 మద్యం బాటిల్స్ పట్టుబడినట్లు ఎస్సై చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

మెంటాడలో 122 మద్యం బాటిల్స్

మెంటాడ: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తినుంచి 122 మద్యం సీసాలను పట్టుకున్నట్లు మెంటాడ ఎస్సై కె.సీతారాం తెలిపారు. ఈ మేరకు మండలంలోని అమరావలస నుంచి జయతి గ్రామం మధ్య టీవీఎస్ ఎక్సెల్ వాహనంతో 122 మద్యం సీసాలను తీసుకువెళ్తున్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకోవడంతో పాటు వ్యక్తి దగ్గర ఉన్న 122 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామన్నారు.

బొబ్బిలిలో 80 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం సీసాలను బెల్ట్ షాపులకు తరలిస్తుండగా ఎస్సై ఆర్.రమేష్ సిబ్బందితో దాడి చేసి ఓవ్యక్తిని మంగళవారం పట్టుకున్నారు. నిందితుడి దగ్గర నుంచి 80 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


రైలు పట్టాల పక్కన మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం, కోరుకొండ రైల్వేస్టేషన్‌ల మధ్య సారిక గ్రామసమీపంలో రైల్వే ట్రాక్‌పక్కన అనుమానాస్పదరీతిలో మహిళ మృతి చెందినట్లు గుర్తించామని జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు మంగళవారం తెలిపారు. మహిళ మృతదేహం పడి ఉన్నట్లు అందిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి, ఐదు అడుగుల రెండు అంగుళాల ఎత్తుకలిగి, ఛామనచాయ రంగు, తెలుపురంగుపై నలుపు రంగు పువ్వులు కలిగిన టాప్, నీలం రంగు ఫ్యాంట్ ధరించి ఉందన్నారు. అకస్మాత్తుగా రైల్లోంచి జారిపడిపోయిందా? ఇంకేమైనా జరిగి ఉంటుందా ? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹206

సబ్ డివిజన్‌ల సమస్యను పరిష్కరించాలి

- రైతుసదస్సులో పాల్గొన్న కలెక్టర్


ఆర్.ముంగినాపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

దెంకాడ: భూముల జాయింట్ ఎల్‌పీఎం సబ్‌డివిజన్‌లకు సంబంధించిన సర్వే సమస్యలను జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సందర్భంగా గ్రామస్తుల సమక్షంలోనే పరిష్కరించాలని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ తహసీల్దార్‌కు సూచించారు. ఈ మేరకు డెంకాడ మండలం ఆర్.ముంగినాపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీ సర్వేలో భూముల సబ్ డివిజన్ అంశాలను కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆయా సమస్యలను రైతుల సమక్షంలోనే పరిష్కరించి సబ్‌డివిజన్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామంలో అసైన్డ్ భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి ఆయా భూములపై పట్టాలు మంజూరు చేసేందుకు జనవరిలో జరిగే నియోజకవర్గ స్థాయి అసైన్డ్ కమిటీల్లో ప్రతిపాదించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పేర్లను కమిటీలో పరిశీలించి ఆమోదించవచ్చన్నారు. గ్రామంలోని పలువురు రైతులు అసైన్డ్ భూములు సాగుచేస్తున్నప్పటికీ తమ పేర్లు ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా నమోదు కాలేదని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ జోక్యం చేసుకుంటూ గ్రామంలోని అర్హులైన అసైన్డ్ భూముల సాగుదారులను గుర్తించేందుకు ఇద్దరు లేదా ముగ్గురు సర్వేయర్లతో కమిటీ వేసి గ్రామంలోని అసైన్డ్ భూమిలో ఎవరు సాగుచేస్తున్నారో వాస్తవంగా నిర్ధారించి వారికి పట్టాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ పద్మావతికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసైన్డ్ భూమి ఎంత? ఎంతమంది సాగుదారులు ఉన్నారనే అంశాన్ని వివరించాలని వీఆర్‌ఓను ఆదేశించారు. గ్రామంలో 27 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా 36 మంది రైతులు సాగుచేస్తున్నట్లు వీఆర్‌ఓ వివరించారు.

ప్రాజెక్టు పేరుతో మొత్తం భూమి ఆన్‌లైన్

గ్రామానికి చెందిన రైతు చింతాడ నరసింహప్పుడు రెవెన్యూ సదస్సులో తన సమస్యను వివరిస్తూ తన తండ్రి పేరున ఉన్న 3.75 ఎకరాల భూమిలో తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టుకు ఒక ఎకరా ఇచ్చామని, అయితే ఆ సర్వే నంబర్‌లో ఉన్న భూమినంతటినీ ప్రాజెక్టు పేరుతో ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారని వివరించాడు. దీనికి స్పందించిన కలెక్టర్ అంబేడ్కర్ ప్రాజెక్టులకు భూసేకరణలో భూములు ఇచ్చిన రైతులకు సంబంధించి వారి నుంచి సేకరించిన భూవిస్తీర్ణం మినహాయించి సర్వే నంబర్‌లోని మిగిలిన భూమిని సంబంధిత రైతు పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. ప్రాజెక్టులకు భూసేకరణ చేసే సమయంలో భూముల సబ్ డివిజన్ చేయకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని, ఇదే తరహాలో గ్రామాల్లో ప్రాజెక్టులకు భూమి ఇచ్చిన ఇతర రైతులకు కూడా సమస్యలు ఉండవచ్చని, ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన వారందరి భూములు పరిశీలించి వారు ప్రాజెక్టుకు ఇచ్చిన భూమిని మినహాయించి మిగిలిన విస్తీర్ణాన్ని ఆ రైతుల పేరుతో సబ్ డివిజన్ నంబర్‌లు కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. గ్రామంలో పలువురు రైతులు, వ్యవసాయ అధికారులతో కలెక్టర్ మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, వ్యవసాయ అధికారి పి.నిర్మల, సర్పంచ్ అట్టాడ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

భగవాన్‌దాస్ మస్టారుకు ఘనంగా నివాళులు


భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: క్రీడారంగంలో కబడ్డీ, ఖోఖో క్రీడల పితామహుడిగా ఖ్యాతినార్జించిన స్వర్గీయ వై.భగవాన్‌దాస్ మాస్టారు సేవలు ఎనలేనివని జిల్లా యోగా అసోయేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకుడు అవనాపు విక్రమ్ పేర్కొన్నారు. భగవాన్‌దాస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్‌దాస్ మాస్టారు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అవనాపు విక్రమ్‌తో పాటు ఆయన శిష్యబృందం కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలురకు నిర్వహించిన కబడ్డీ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ దాస్ మాస్టారుతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా తన తండ్రి స్వర్గీయ అవనాపు సూరిబాబు అందించిన సేవలు గుర్తు చేసుకున్నారు. వారిద్దరి సారథ్యంలో కబడ్డీ క్రీడలో విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. మళ్లీ కబడ్డీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ వెల్లడించారు. కార్యక్రమంలో భగవాన్ దాస్‌తో పాటు కబడ్డీకి సేవలు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చిన్నంనాయుడు, చిట్టిరాజు, టీఎల్‌పీ రాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు బొమ్మన రామారావు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపధ్యాయులు, కబడ్డీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిలాస్థాయి కబడ్డీ పోటీలకు 27 జట్లు హాజరు

స్వర్గీయ వై.భగవాన్‌దాస్ మాస్టారు జయంతిని పురస్కరించుకుని భగవాన్‌దాస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలుర కబడ్డీ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 27 జట్లు హాజరయ్యాయి. జోరువానలో సైతం ఆద్యంతం ఉత్కంఠభరితంగా పోటీలు సాగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: వినియోగదారుల చట్టాలపై ప్రజలందరికీ అవగాహన ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించేందుకు వినియోగదారుల క్లబ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాక్సుల్లోని తినుబండారాలు, రోడ్లపై బండ్ల వద్ద తయారయ్యే కలుషిత ఆహారాన్ని తినడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే ఆస్కారం ఉంటుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల సైబర్ క్రైం, ఈ-కామర్స్ మోసాలకు గురవుతున్నారని, దీనిపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల, పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వినియోగదారులను చైతన్యపరిచే పలు సంస్థల వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల ప్రదర్శన స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ టి.ధర్మ చంద్రారెడ్డి, వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి. జగన్‌మోహన్‌రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి. శ్రీనివాసరావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె. రత్నరాజు, జిల్లా ఆహార తనిఖీ అధికారి ఎ.రామయ్య పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్
- జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం


నేరసమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని, అక్రమ రవాణాకు పాల్పడిన వారిని అరెస్టు చేస్తూనే, వారికి గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, మధ్యవర్తిగా వ్యవహరించిన వారిని, ప్రధాన వ్యాపారులను గుర్తించి, ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులకు సూచించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీస్‌అధికారులతో మంగళవారం ఆయన నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంలో పగలు, రాత్రి బీట్లు వేయాలని, పెట్రోలింగ్‌ను మరింత విస్తృతం చేయాలని సూచించారు. నేరాలు, ఈవ్‌టీజింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలు, ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కూడళ్లు, బ్యాంకులు, కళాశాలల వద్ద గస్తీని పెంచాలని స్పష్టం చేశారు. రాత్రి గస్తీకి వెళ్లే సిబ్బంది అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ స్కానర్‌లో నిక్షిప్తం చేయాలని, వారి నేర చరిత్రను పరిశీలించాలని సూచించారు. రాత్రి 11 గంటల తర్వాత సహేతుకరమైన కారణం లేకుండా తిరిగే వారిపై కేసులు నమోదుచేయాలన్నారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నట్లయితే వారి షీట్లను ఆయాప్రాంతాలకు బదిలీ చేసి, వారిపై నిఘా పెట్టాలని చెప్పారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఆస్తుల వివరాలను క్రమపద్ధతిలో రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. పోక్సో, లైంగికదాడి కేసుల్లో దర్యాప్తును 60 రోజుల్లో పూర్తిచేసి, న్యాయస్థానాల్లో అభియోగపత్రాలను దాఖలు చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అనధికార మద్యం విక్రయాలు (బెల్ట్ షాపులు) లేకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో నిఘాపెట్టి, బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పేకాట, కోడిపందాలు జరగకుండా చూడాలని, ముందస్తుగా సమాచారం సేకరించి దాడులు చేయాలని చెప్పారు.

ప్రతిభావంతులకు ప్రశంసలు

వివిధ కేసుల్లో విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, న్యాయసలహాదారు వై.పరశురామ్, పలువురు సీఐలు, ఆర్ఐలు, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్సైలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్

27న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

పార్వతీపురంటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

జనవరి 7వ తేదీ నుంచి 13తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరగనున్న సీనియర్ జాతీయ వాలీబాల్ క్రీడా పోటీలకు రాష్ట్రం నుంచి సీనియర్ మహిళలు-పురుషుల జట్లకు ఎంపికలను క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 27వతేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సీనియర్ మహిళలు-పురుషుల జట్ల రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల జిల్లా సీనియర్ వాలీబాల్ మహిళ-పురుష క్రీడాకారులు ఆరోజు ఉదయం 7గంటల నుంచి ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్‌తో హాజరుకావాలని సూచించారు. జిల్లాలో గల వాలీబాల్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రాష్ట్రస్థాయి ఎంపిక కార్యక్రమంలో పాల్గొని జిల్లా తరఫున జాతీయ పోటీలకు ఎంపిక కాగలరని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9866805716, 9701648344 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వ భూములను గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పలు వసతులు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున అందుకు అవసరమైన భూమిని మండలాల్లో గుర్తించాలని సూచించారు. 100 విద్యుత్ కనెక్షన్ల కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో సోలార్ పవర్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించాలని చెప్పారు. గ్రామ పంచాయతీ భ భవనాల నిర్మాణానికి, ఫిష్ మార్కెట్ ఏర్పాటు, నగర వనాలు నెలకొల్పేందుకు, పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అవసరైన స్థలాలను గుర్తించాలని స్పష్టం చేశారు. ఫిష్ హ్యాచరీస్ నిర్మాణానికి ఐదు హెక్టార్ల భూమి అవసరమని అభిప్రాయ పడ్డారు. అడంగల్‌ను సక్రమంగా నిర్వహించాలని కోరారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సమయం

- శతశాతం ఫలితాల సాధనకు 'సంకల్పం'
- విడుదలైన పరీక్షల షెడ్యూల్.. మార్చిలో నిర్వహణ
- జిల్లాలో 84 కళాశాలల నుంచి 17,403 మంది పరీక్షలకు సంసిద్ధం


పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల్లో నిమగ్నమైన ఇంటర్‌మీడియట్ విద్యార్థులు

పాలకొండ రూరల్: సగటు విద్యార్థికి ఇంటర్‌మీడియట్ విద్య కీలక దశ. ఇక్కడే అధిక సంఖ్యలో విద్యార్థులు వెనుకబడి పోతుంటారు. ఈ పరిస్థితిని అధిగమించి ఉత్తమ ఫలితాల సాధనకు రాష్ట్ర ఇంటర్‌మీడియట్ బోర్డు ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యార్థుల హాజరుపెంపుతో పాటు వ్యక్తిగత ప్రమాణాలను పెంచేలా చర్యలకు ఉపక్రమించింది. ఈ విద్యా సంవత్సరం పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన 84 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 8968మంది, ద్వితీయ సంవత్సరం 8435 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టాలని డీఐఈఓ జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

పాఠ్యాంశాల వారీగా..

ఇంటర్మీడియట్ పరీక్షలకు మూడు నెలల సమయం ఉండడంతో విద్యాశాఖాధికారులు పాఠ్యాంశాల వారీగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రస్తుత నెలలో పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేయనున్నారు. వెనుకబడిన వారిని, ముందున్న వారితో సమానం చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుని రెండో నెలల పాటు ఈ విధానం అమలు చేయనున్నారు. ఇలా పబ్లిక్ పరీక్షల సమయం వరకు అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

శ్రద్ధగా చదువుకునేలా..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను బృందాలుగా విభజించి, ఒక్కో బృందం బాధ్యతలను ఒక్కో అధ్యాపకుడితో అనుసంధానం చేశారు. విద్యార్థులు రోజూ కళాశాలకు వచ్చేలా, అన్ని పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణత సాధించేలా చేయడం ఆ అధ్యాపకుడి బాధ్యతే. ఇందులో భాగంగా కళాశాలలోనే కాకుండా ఇంటికి వెళ్లిన తర్వాత చదువుకునేలా ఉదయం త్వరగా నిద్రలేచేలా చూస్తున్నారు. ఆ సమయంలో చదువుకుంటున్నారా లేదా అనే అంశాన్ని సెల్ ఫోన్ ద్వారా వాకాబు చేస్తున్నారు. స్థానికంగా ఉంటే నివాసాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ఉండడంతో పాటు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రతి కళాశాలలో ఒక అధ్యాపకుడిని కౌన్సిలర్‌గా నియమించారు.

సంకల్ప్ కార్యక్రమం..

ప్రతి జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత పెంచేందుకు సంకల్ప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులను వారి అభ్యసన సామర్థ్యం, అక్టోబర్‌లో నిర్వహించిన క్వార్టర్లీ పరీక్షల్లో మార్కుల ఆధారంగా 3 కేటగిరీలుగా విభజిస్తారు. మెరుగైన విద్యార్థులను ఎ కేటగిరీ, మధ్యస్థంగా ఉన్న వారిని బి కేటగిరీ, తక్కువ మార్కులు వచ్చిన వారిని సి కేటగిరీగా విభజిస్తారు. అర్ధ సంవత్సరం పరీక్షలు, ప్రీ ఫైనల్స్ పరీక్షల మార్కులను ఆధారంగా వారి కేటగిరీల్లో కూడా మార్పులు చేస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేకశిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. శాఖాపరమైన ఉన్నతాధికారుల సూచనలతో సంకల్ప్ కార్యక్రమం ప్రతి కళాశాలలో అమలయ్యేలా చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో జూనియర్ కళాశాలలను పర్యవేక్షించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో సరైన బోధన, శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– దుంగ మంజులవీణ, ఇంటర్‌మీడియట్ జిల్లా విద్యాధికారిణి

సమాజ ఆరోగ్యం కోసమే ఫిట్ఇండియా


ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ


సైకిల్ తొక్కుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: సమాజం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఫిట్ఇండియా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్ ఆవరణలో సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతతో కలిసి సైకిల్ తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రోజురోజుకు యాంత్రీకరణ పెరిగిపోతున్న తరుణంలో సైకిల్ వినియోగం తగ్గిందన్నారు.ఈ కారణంగా వ్యాయామం లేక పలు రుగ్మతలు వస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం సైకిల్ వినియోగంపై అవగాహన, ప్రాముఖ్యాన్ని తెలియజేసేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సైకిల్ వినియోగం వాయు కాలుష్యం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఇంధనం పొదుపు చేయడమే కాకుండా సైకిల్ తొక్కడం ఎంతో ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందన్నారు. సైకిల్ వినియోగం పెంచేలా యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ బి.రాంగోపాల్‌తో పాటు కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.